
నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

వసతిలో.. అర్ధాకలి

ఆకలి కేకలు.. అర్ధాకలితో వసతిగృహాల విద్యార్థులు అల్లాడుతున్నారు. తల్లిదండ్రులకు దూరంగా హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు కడుపు నిండక నకనకలాడుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు పాలకులు చెబుతున్నా ఇది ఆచరణలో కనిపించడంలేదు. ప్రభుత్వం మొక్కుబడిగా వసతి గృహాలను నిర్వహిస్తుందన్న ఆరోపణలున్నాయి. తొమ్మిది నెలలుగా సంక్షేమ వసతి గృహాలకు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. బిల్లులు ఇవ్వకపోతే విద్యార్థుల ఆకలి ఎలా తీర్చాలి.. హాస్టళ్లను ఎలా నిర్వహించాలని వార్డెన్లు ప్రశ్నిస్తే.. ఏముంది అప్పులు చేయండి.. సరుకులు తెచ్చి వండి పెట్టండి.. అంటూ ఉన్నతాధికారుల ఆదేశాలతో వసతిగృహాల నిర్వహకులు అందినకాడికి అప్పులు చేయాల్సి వస్తోంది. విద్యార్థుల కడుపు మాడ్చలేక.. అప్పులు తీర్చలేక.. బిల్లులు రాక దిక్కుతోచనిస్థితిలో సంక్షేమాధికారులు కొట్టుమిట్టాడుతున్నారు. అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో వార్డెన్లు ఆర్థిక వేతలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సూచిస్తున్న భోజన పట్టికను అమలు చేయలేని దుస్థితి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వసతిగృహాల్లో నెలకొంది. భోజన మెనూ పరిస్థితి ఇలా ఉంటే విద్యార్థులకు ఇవ్వాల్సిన దుప్పట్లు, నోటు పుస్తకాలు, ప్లేటులతో పాటు కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం నాలుగు నెలలుగా విస్మరించింది. సంక్షేమ వసతిగృహాల్లోని సమస్యలతో అల్లాడుతున్న విద్యార్థులకు కొన్ని నెలలుగా ఆహారం కూడా సమస్యగా మారింది. ఇక హాస్టళ్ల నిర్వహణకు విడుదల కావాల్సిన కనీస నిధులు విషయంలోనూ ప్రభుత్వం అలక్ష్యం ప్రదర్శిస్తోంది.

- విద్యార్థుల ఆకలి కేకలు
- హాస్టళ్ల నిర్వహణపై నిర్లక్ష్యం
- అప్పుల ఊబిలో హాస్టళ్ల వార్డెన్లు
- 9 నెలలుగా విడుదల కాని బిల్లులు
- విద్యార్థుల కాస్మోటిక్ చార్జీలకూ దిక్కులేదు
- దుప్పట్లు, నోట్‌బుక్స్ పంపిణీ మరిచిన వైనం
- కూటమి ప్రభుత్వంలోనూ విడుదల కాని బకాయిలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భోజనం అందక అర్ధాకలి. కప్పుకోవడానికి దుప్పటి లేదు.. తలకు నూనె లేదు.. స్నానానికి సబ్బులేదు.. రాసుకోవడానికి నోటు పుస్తకాలు లేవు.. ఇదీ ఉమ్మడి గుంటూరు పరిధిలోని హాస్టళ్ల విద్యార్థుల పరిస్థితి.



సంక్షేమం సంక్షోభంలో పడటంతో విద్యార్థులు అర్ధాకలిలో అలమటి స్తున్నారు. వసతిగృహాల నిర్వహణపై నిర్లక్ష్యం అలుముకుంది. గత విద్యా సంవత్సరం డిసెంబరు నుంచి వసతిగృహాలకు ప్రభుత్వం బిల్లులు చెల్లిం చలేదు. వైసీపీ ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారం భమైన ఈ విద్యా సంవత్సరంలో నాలుగు నెలలు గడిచినా నేటి వరకు వసతిగృహాలకు నిధులు విడుదల చేయలేదు. దాదాపు తొమ్మిది నెలలుగా వసతి గృహాల బిల్లులు రూ.కోట్లలో పేరుకుపోయినా ప్రభుత్వంలో స్పంద నలేదు. కాస్మోటిక్ చార్జీలు విద్యార్థులతో పాటు నోటు పుస్తకాలు, దుప్ప ట్లు, ప్లేట్లు, ట్రంకుపెట్టె తదితర సామగ్రి ఈ విద్యా సంవత్సరంలో ఒక్కరికి కూడా పంపిణీ చేయలేదు. ఎస్సీ విద్యార్థులకు అందాల్సిన సౌకర్యా లకూ ప్రభుత్వం గండి కొడుతున్నదన్న విమర్శలున్నాయి. వంద మంది విద్యార్థులు ఉంటే నెలకు ప్రభుత్వం భోజన బిల్లు రూ.1.40 లక్షలు చెల్లిం చాలి. ఇలా లెక్కిస్తే వంద మంది విద్యార్థులు ఉన్న వసతి గృహానికి ఇప్పటి వరకు రూ.12.60 లక్షలు చెల్లించాల్సి ఉంది. నెల నెలా అప్పు చేసి వసతిగృహాలను నిర్వహిం చాల్సి వస్తోంది. బిల్లుల బకాయి లు పేరుకు పోతుండ టంతో సంక్షేమాధికా రులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. కూరగాయలు, సరుకులు, గ్యాస్, పాలు అప్పు పద్ధతిలో కొనుగోలు చేసి బిల్లులు విడుదలైన సమయంలో వాటిని వసతి గృహాల అధికారులు గతంలో చెల్లించే వారు. వసతి గృహాలకు డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేసే విధానాన్ని వైసీపీ ప్రభుత్వం ఎత్తేసింది. ఎంఎల్ఎస్ పాయింట్‌లో డీడీ అందజేసి బియ్యం వసతి గృహాలకు చేర్చుకోవాలి. హెచ్‌డబ్ల్యువో లు సొంతంగా నగదు చెల్లించి బియ్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గ్యాస్ అప్పు లభించే పరిస్థితి లేదు. గ్యాస్ సిలెండర్‌ను వార్డెన్లే కొనుగోలు చేస్తున్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో సరుకులు, పాలు, కూరగాయల సరఫరా కూడా కొన్ని వసతి గృహాలకు నిలిచిపోయింది. దీంతో ప్రైవేట్ అప్పులు చేసి వీటిని కొనుగోలు చేస్తున్నారు. నెలల తరబడి బిల్లులు విడుదల కాకపోవడంతో ప్రస్తుతం దుకాణాల్లో అప్పు దొరకని పరిస్థితులు నిర్వహకులు ఎదుర్కొంటున్నారు. బిల్లుల చెల్లింపులో ఇలానే జాప్యం జరిగితే విద్యార్థులు భోజనానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం పొంచి ఉంది. బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలకు మాత్రం ఇటీవల బిల్లుల బకాయిలు చెల్లింపులు జరిగినట్లు సమాచారం.

మెనూ.. మమ

వసతిగృహాల్లో ఉండే కళాశాల విద్యార్థులకు రోజుకు రూ.53.33, పాఠశాల స్థాయి విద్యార్థులకు రోజుకు రూ.46.66 ప్రభుత్వం చెల్లిస్తోంది. మార్కెట్‌లో ధరలను పరిశీలిస్తే ఈ ధరకు భోజనం అందించలేని పరిస్థితి. ఉదయం రోజుకో రకం వేరుశనగ చట్నీతో అల్పాహారం, పాలు, బెల్లంతో రాగి జావ, చిక్కీలు, రాత్రి భోజనం, అరటి పండు, వారంలో మూడు రోజుల చికెన్, ఆరు రోజులు ఉడికించిన గుడ్డు ఇవ్వాలి. ఇలా మెనూ అమలుకు ఒక్కో విద్యార్థికి రూ.2200 ఖర్చు అవుతున్నట్లు నిర్వహకులు చెబుతున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులు ఒక్కొక్కరికి నెలకు రూ.2,200 ఖర్చు అవుతుంటే ప్రభుత్వం రూ.1,400 చెల్లిస్తోంది. కళాశాలల విద్యార్థులకు నెలకు రూ.1,600 మాత్రమే చెల్లిస్తుంది. ఉప్పు, పప్పులు, కూర గాయలు నూనె, గ్యాస్ ఒకటేమిటి అన్ని వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. ఈ స్థాయిలో ప్రభుత్వం వసతి గృహాలకు బడ్జెట్ పెంచడం లేదు. వసతి గృహాల నిర్వహణ అధికారులు ప్రభుత్వం ఇస్తున్న నిధులు సరిపోక మెనూలో కోత విధిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం మెనూ అమలు చేయాలంటే సదరు అధికారి జీతం మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్ ధరలకు అనుగుణంగా బడ్జెట్‌ను పెంచాలని పదే పదే ప్రభుత్వానికి వసతి గృహాల నిర్వహణ అధికారులు ఇస్తున్న అర్జీలపై స్పందించడంలేదు. వసతి గృహాలకు ప్రభుత్వం చెల్లించే సరుకుల ధరలకు మార్కెట్ ఉన్న ధరలకు పొంతన లేదు. మెనూ ప్రకటించిన ప్రభుత్వం విద్యార్థులకు కేటాయించిన చార్జీలను పెంచడాన్ని విస్మరించింది. దీంతో మెనూ ప్రకారం చికెన్, కోడి గుడ్డు విద్యార్థులకు ఇవ్వలేక కోతపెడుతున్నారు.



ఇంటి నుంచి నగదు వస్తేనే నూనె, సబ్బు

ప్రభుత్వం నెలవారీ కాస్మోటిక్ చార్జీలను విద్యార్థులకు చెల్లించడంలేదు. దీంతో తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటి వైపు చూడక తప్పడంలేదు. విధి లేక ప్రతి నెలా తమ తల్లిదండ్రులను ఖర్చులకు డబ్బులు పంపమని అడగడం పరిపాటిగా మారింది. వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రతి నెలా కాస్మోటిక్ చార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాల్సి ఉంది. 7 నుంచి పదో తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున ఇవ్వాలి. బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ చార్జీల కింద అదనంగా విడుదల చేయాలి. అయితే ఈ సొమ్మును ప్రభుత్వం చెల్లించకపోతుండటంతో విద్యార్థులు ఇంటికెళ్లి తమ అవసరాల నిమిత్తం డబ్బులు తెచ్చుకుంటున్నారు. ఇది తల్లిదండ్రులకు భారంగా మారుతోంది.

కనీస వసతులకు నిధులు లేవాయే

వసతి గృహాల నిర్వహణకు కొన్ని నెలలుగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదు. వసతిగృహాల్లో లైట్లు మార్చాలన్నా వార్డెన్లు జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి తదితరాల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదు. వైసీపీ పాలనలో వసతి గృహాలపై నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతి గృహాలకు మహర్దశ పడుతుందని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, వార్డెన్లు ఆశించారు. అయితే కూటమి ప్రభుత్వంలో కూడా వసతి గృహాల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆయా వర్గాల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

- ఒప్పందం ప్రకారం 40 శాతం వాటా వారిదే
- కార్మికులను దూరం పెట్టిన జూట్‌మిల్లు యాజమాన్యం
- మిల్లు స్థిర చరాస్తులపై సర్వహక్కులు తమవేనని ఇష్టారాజ్యం

గ్రీన్‌గ్రేస్‌లో కార్మికుల వాటా ఏమైందో?

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భజరంగ్ జూట్‌మిల్లుకు చెందిన స్థిరాస్తిలో నిర్మాణం చేపట్టిన గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్‌పై తమకు కూడా హక్కు ఉందని కార్మికులు పేర్కొంటున్నారు. ఖాయిలా పడిన జూట్‌మిల్లుని తిరిగి తెరిపించినప్పుడు అన్ని స్థిర, చరాస్తులపై కార్మికులకు 40 శాతం వాటా, మిగిలిన 60 శాతం వాటా యాజమాన్యానికి కల్పిస్తూ ఒప్పందం కూడా చేసుకున్నారు. ఎప్పుడైతే బకాయిలు తీరిపోయాయో అప్పటి నుంచి మిల్లు యాజమాన్యం కార్మికులను దూరం పెట్టేసింది. అన్నింటిపై సర్వహక్కులు తమవేనని స్వీయ ప్రకటన చేసి తిరిగి మిల్లుని మూసేసింది. ఆ తర్వాత భజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా పేరుతో ఒక సంస్థని ఏర్పాటు చేసి సుమారు 5 ఎకరాలకు పైగా ఉన్న విలువైన భూమిలో 500లకు పైగా అపార్టుమెంట్ ఫ్లాట్లను జీ+15 అంతస్తుల్లో నిర్మాణం చేపట్టింది. ఈ క్రమంలో కార్మిక యూనియన్లు, సంఘాలు బలహీనపడిపోవడంతో మిల్లు యాజమాన్యం ఇష్టారాజ్యమైపోయింది. 1994కి ముందే మిల్లు ఖాయిలా పడిన సమయంలో కేంద్ర ఆర్థిక శాఖకు చెందిన బోర్డు ఆఫ్ ఇండస్ట్రియల్ ఫైనాన్స్ రీ కన్‌స్ట్రక్షన్(బీఐఎఫ్ఆర్) సంస్థ అప్పట్లో ఉన్న బాకీలు తీర్చేందుకు కార్మికులు, మిల్లు యాజమాన్యం మధ్య ఒక ఒప్పందం చేసింది. దాని ప్రకారం రూ.40 లక్షలు కార్మికుల వాటాగా, రూ.1.20 కోట్లు యాజమాన్యం సమకూర్చేలా ఒప్పందం జరిగింది. కార్మికుల తరపున పరిశ్రమల శాఖ ఒక ఉత్తర్వు కూడా జారీ చేసింది. కార్మికులు చెల్లించాల్సిన వాటాకు సంబంధించి వాణిజ్య పన్నుల రాయితీలు కల్పించారు. కొన్ని సంవత్సరాల్లోనే మిల్లు బాకీలు తీరిపోయాయి. దాంతో 2002లో బీఐఎఫ్ఆర్ నుంచి బయటకు వచ్చేసేందుకు ఎన్‌వోసీ కోసం నివేదించారు. ఆ తర్వాత మిల్లు యాజమాన్యం స్వతంత్రంగా మారింది. వ్యాపారం వరకు మాత్రమే స్వతంత్రంగా చేసుకోవచ్చని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందే తప్ప ఎక్కడా కార్మికుల వాటాలు తొలగించలేదు. కార్మికుల వాటాలు తొలగించమని ప్రభుత్వం నుంచి సవరణ ఉత్తర్వులు రాలేదు. కార్మికులు చనిపోయేంత వరకు వారికి వాటా ఉంటుందని స్పష్టంగా ఉత్తర్వులున్నాయి. అయినా యాజమాన్యం మిల్లు స్థిర చరాస్తుల్లో కార్మికులకు ఎలాంటి వాటా లేదని, సర్వహక్కులు తమవేనని పేర్కొన్నది. 2009లో కార్మికుల తరపు నుంచి ఇద్దరు డైరెక్టర్లు యాజమాన్యంలో ఉండాలి. అయినా పెట్టలేదు. ఆ తర్వాత కార్మిక సంఘాల్లో కొందరిని కొనేసి కార్మికుల పొట్ట కొట్టింది. వాస్తవానికి ఇప్పుడు నిర్మాణం జరుగుతున్న గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్లపై తమకు కూడా హక్కు ఉందని శ్రీ భజరంగ్ జ్యూట్‌మిల్లు జై భీమ్ కార్మిక సంక్షేమ సంఘం నాయకులు స్పష్టం చేస్తున్నారు.


నిర్మాణంలో ఉన్న గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్

సకాలంలో పెన్షన్ల పంపిణీ చేయాలి

- 1న ఉదయం 5 గంటలకు ప్రారంభించాలి
- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు

నరసరావుపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేయడంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. పింఛన్ల పంపిణీ చర్యలపై కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేగం తగ్గకుండా పంపిణీ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. 1వ తేదీ ఉదయం 5 గంటలకల్లా జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని తెలిపారు. బ్యాంకుల్లో పింఛన్ నగదును అందుబాటులో ఉంచాలన్నారు. సంబంధిత అధికారులు ముందుగానే పింఛన్ సొమ్మును డ్రా చేసుకుని ఉండాలని తెలిపారు. జిల్లాలో పెన్షన్ల పంపిణీ త్వరితగతిన పూర్తి చేసి రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు సోమవారం రాత్రి మండల కేంద్రంలో బస చేసి క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని పింఛన్ల పంపిణీలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

తక్షణమే సమస్యలను పరిష్కరించాలి

నరసరావుపేట టౌన్: ప్రజల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని కలెక్టర్ అరుణబాబు ఆదేశించారు. ఎస్సీ ఎస్టీలకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన 21 మంది తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన వర్గాల కోసం ప్రత్యేకంగా ప్రతీ నెల నాలుగో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వినాయకం తదతరులు పాల్గొన్నారు.


అర్జీదారుల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణబాబు

విద్యుత్‌శాఖలో
కొత్త సర్కిల్స్ పునర్విభజన
● కొత్త జిల్లాల వారీగా సర్కిల్స్ ఏర్పాటు
● ఎస్ఈల నియామకాలపై నేటికీ సందిగ్ధం
ప్రత్యామ్నాయ పంటలసాగుపై
ప్రణాళికలు రూపొందించాలి
● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
7లో..


LYCA
OCT. 10
WORLDWIDE RELEASE
వేట్టయన్
ద హంటర్
PRODUCED BY SUBASKARAN
TAMIL TELUGU HINDI KANNADA


OCT 11TH
IN CINEMAS WORLDWIDE
విశ్వం


CULT CONCEPTS
'OSHO' THULASIRAM'S
దక్షిణ
OCTOBER 4TH RELEASE
PRODUCER : ASHOK SHINDE


PHOENIX GAGA
JOKER FOLIE A DEUX
THE WORLD IS A STAGE
OCTOBER 2nd
WEDNESDAY RELEASE
FILMED FOR IMAX
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


MASSIVE BLOCKBUSTER
MAN OF MASSES NTR
DEVARA
PART 1
KORATALA SIVA
IN CINEMAS NOW


BGM STUDIO
దసరా నవరాత్రుల శుభాకాంక్షలతో
OCTOBER 3RD
WORLDWIDE RELEASE
IN THEATRES
చిట్టి పొట్టి
Story, Screenplay, Producer & Director
BHASKAR YADAV DASARI


BLOCKBUSTER HIT
KARTHI ARVIND SWAMI
సత్యం సుందరం
IN CINEMAS NOW



లయోలా పాఠశాలలో ఆటల పోటీల సందర్భంగా క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, సెప్టెంబరు 28: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోరారు. స్థానిక లయోలా పాఠశాలలో 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -17 ఫుట్‌బాల్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. తొలుత ఆయన క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ఆరంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో హయాంలో క్రీడలను ఏర్పాటు చెయ్యాడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో హయాంలో విద్యతోపాటు, క్రీడలు, క్రీడా మైదానాలకు పూర్వవైభవం రానున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు క్రీడాకారులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వినుకొండ మైదానంలో త్వరలో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు రాష్ట్ర స్థాయి జట్టును ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు జట్టు విజయం కోసం కష్టపడి రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను రాయల్, మేడమ్ రమేష్, రెవరెండ్ ఫాదర్ జ్ఞానదేవన్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఫాదర్.రవి, ఎంఈవో జఫ్రుల్లా, టోర్నమెంట్ పరిశీలకుడు డాక్టర్ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 550 మంది క్రీడాకారులకు భోజన వసతి కల్పించిన జనసేన పార్టీ నాయకులు నాగశ్రీనును నిర్వాహకులు దుశ్శాలువాతో అభినందించారు.

హోరా హోరీగా తలపడుతున్న జట్లు

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ ఆటల పోటీలలో బాలికల విభాగంలో నెల్లూరు-పశ్చిమగోదావరి జట్లు తలపడగా నెల్లూరు జట్టు విజయం సాధించింది. విశాపట్నం- చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు విజయం సాధించింది. గుంటూరు-శ్రీకాకుళం మధ్య జరిగిన పోటీలో గుంటూరు, విజయనగరం-కృష్ణ మధ్య జరిగిన మ్యాచ్‌లో కృష్ణ జట్టు విజయం సాధించింది.

బాలుర విభాగంలో గుంటూరు-శ్రీకాకుళం మధ్య జరిగిన మ్యాచ్‌లో గుంటూరు, పశ్చిమగోదావరి- ప్రకాశం మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం, విశాఖపట్టణం- కృష్ణ మధ్య జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్టణం జట్టు విజయం సాధించాయి. నెల్లూరు - అనంతపురం, తూర్పుగోదావరి- కడప జట్లు మధ్య జరిగిన హోరా హోరీ పోటీలు డ్రాగా ముగిసాయి. పోటీలను తిలకించేందుకు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో సర్కిళ్ల పునర్విభజన

- కొత్త జిల్లాల వారీగా ఏర్పాటు
- ఎస్ఈల నియామకాలపై నేటికీ సందిగ్ధత

గుంటూరు, సెప్టెంబరు 28: విద్యుత్‌శాఖలో కొత్త సర్కిల్స్ పునర్విభజనకు శ్రీకారం చుట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా కొత్త సర్కిల్స్ ఏర్పాటు చేసి ఆ మేరకు బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాను మూడు సర్కిల్స్‌గా విభజిస్తూ ఏపీసీపీడీసీఎల్ సీఎండీ రవి ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్‌శాఖలో కొత్త సర్కిల్స్ ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. ఇప్పటికే ఈపీడీసీఎల్ పరిధిలోనూ కొత్త సర్కిల్స్ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సీపీడీసీఎల్ పరిధిలో ఇప్పటికే విజయవాడ సర్కిల్‌తో పాటు మచిలీపట్నం, సీఆర్‌డీఏ, గుంటూరు, ఒంగోలు సర్కిల్స్ ఉన్నాయి. ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి విభజిత జిల్లాలుగా రూపాంతరం చెందిన నరసరావుపేట(పల్నాడు), బాపట్ల జిల్లాలకు కూడా కొత్త సర్కిల్స్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన గతంలోనే ఉంది. అయినా గత ప్రభుత్వంలో ఇది కార్యరూపం దాల్చలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్‌శాఖపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పల్నాడు, బాపట్ల జిల్లాలకు కూడా కొత్త విద్యుత్ సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. కాగా గుంటూరు కేంద్రంగా ఉన్న గుంటూరు సర్కిల్‌లో గుంటూరు-1 డివిజన్, తెనాలి డివిజన్, నరసరావుపేట డివిజన్‌లున్నాయి. ఇకపై పల్నాడు సర్కిల్ ఏర్పాటైతే నరసరావుపేట కేంద్రంగా ఏర్పాటు చేసిన పల్నాడు సర్కిల్‌లో నరసరావుపేట, మాచర్ల డివిజన్‌లు ఉండనున్నాయి. అలానే బాపట్ల కేంద్రంగా ఏర్పాటైన బాపట్ల సర్కిల్‌లో బాపట్ల, చీరాల, అద్దంకి డివిజన్‌లు ఏర్పాటు చేశారు. ఇక సీఆర్‌డీఏ సర్కిల్‌లో అమరావతి, గుంటూరు-2 డివిజన్‌లు యథావిధిగానే ఉన్నాయి. వీటిలో కూడా పునర్విభజన జరుగుతుందా అనేది చూడాల్సి ఉంది. కాగా బదిలీల్లో అధికారుల పోస్టింగ్‌లు కల్పించిన యంత్రాంగం కొత్త కార్యాలయాలు ఎక్కడ అనే దానిపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. సర్కిల్స్ ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ) లుగా అదే స్థాయి అధికారులను నియమిస్తారా, ఉన్న వారికి ఉద్యోగోన్నతి కల్పించి పోస్టింగ్‌లు కల్పిస్తారనేది తేలాల్సి ఉంది. ఇక సర్కిల్స్‌లో కీలకమైన సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎస్ఏవో) అధికారి పోస్టు కొత్త సర్కిల్స్‌లో లేకపోవటం చర్చకు దారి తీస్తోంది. కాగా నేటికీ కొత్త సర్కిల్స్‌కు ఆపరేషన్ ఎస్ఈల నియామకాలు చేపట్టకపోవడంతో పాటు పూర్తిస్థాయిలో ఉద్యోగుల పోస్టింగ్‌లు కల్పించకపోవటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కొత్త సర్కిల్ కార్యాలయాలకు బదిలీ చేసిన ఉద్యోగులు ఏ కార్యాలయంలో విధులు నిర్వహించాలనేది ప్రశ్నార్థకంగా మారింది.

సచ్చిదానందమూర్తి రచనలు నేటి జీవన స్థితిగతులకు మార్గదర్శకాలు

పెదకాకాని, సెప్టెంబరు 28: పద్మవిభూషణ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి ప్రపంచ తత్వవేత్తల్లో ఒకరుగా నిలుస్తారని నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే గంగాధరరావు పేర్కొన్నారు. సచ్చిదానందమూర్తి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సు వివరాలను శనివా రం ఆయన విలేకర్లకు తెలిపారు. తత్వశాస్త్రంలో తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీకగా సచ్చిదానందమూర్తి నిలుస్తారన్నారు. సంగం జాగర్లమూడి ప్రాంతానికి చెందిన కొత్త సచ్చిదానందమూర్తి సాధారణ ప్రొఫెసర్ స్థాయి నుంచి యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా ఎదగడం తెలుగువారికి గర్వకారణమన్నారు. సచ్చిదానందమూర్తి రచనలు నేటి ఆధునిక జీవన స్థితిగతులకు మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆయన తెలుగుజాతి గర్వించేలా ఎదిగారని తెలిపారు. ఆయన జన్మించి శత వసంతాలైన సందర్భంగా ఆయనను గౌరవించుకోవడం యూనివర్సిటీ బాధ్యతని చెప్పారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యూనివర్సిటీగా ఏర్పడక ముందు నల్లపాడులో ఏర్పాటుచేసిన పీజీ సెంటర్‌కు ఆయన స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేశారన్నారు. సచ్చిదానందమూర్తి రచనలను నేటి తరానికి పరిచయం చేసేందుకు సోమ, మంగళవారాల్లో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. పద్మ విభూషణ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి విజన్ ఆన్ ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్ రిఫ్లెక్షన్స్ ఆన్ 21వ సెంచరీ ఎడ్యుకేషనల్ పాలసీ అండ్ ప్లానింగ్ ఇన్ ఇండియా అనే అంశంపై సదస్సును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ నెల 30న జరిగే ఈ సదస్సుకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్య ప్రసాద్, నాదెండ్ల మనోహర్, అవనిగడ్డ, పొన్నూరు శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, యూపీఎస్సీ పూర్వ సభ్యులు ప్రొఫెసర్ కె. ఎస్. చలం పాల్గొంటారని పేర్కొన్నారు. సదస్సులో న్యూఢిల్లీలోని ఢిల్లీ యూనివర్సిటీ ఫిలాసఫీ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ అశోక్ వోహ్రా కీలక ఉపన్యాసం ఇస్తారని వీసి వెల్లడించారు. ఆచార్య త్రిమూర్తి రావు కన్వీనర్‌గా నిర్వహిస్తున్న ఈ జాతీయ సదస్సుకు దేశ నలుమూలల నుంచి మేధావులు, ఉన్నత విద్యావంతులు హాజరవుతారని తెలిపారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ గంగాధరరావు



బహుమతులు అందజేస్తున్న వీసీ ఆచార్య పి నాగభూషణ్ తదితరులు

విజ్ఞాన్‌లో ముగిసిన ఐసీఎన్ఏఎస్‌సీ సదస్సు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 28: స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం, డిపార్టుమెంట్ ఆఫ్ మ్యాథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నాన్ లీనియర్ అనాలిసిస్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్ సదస్సు శనివారం ముగిసింది. సదస్సులో చైనాలోని షెంఝన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ మెహరిన్ మజాందరణి మాట్లాడారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి నాగభూషణ్ పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

సచివాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కిషోర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 : సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అప్పికట్ల కిషోర్ ఎన్నికయ్యారు. 11వ వార్డు సచివాలయంలో పని చేస్తున్న ఆయనను శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ పదవికి ఎన్నుకున్నారు. డెమొక్రటిక్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా జోసఫ్ కిషోర్, ఉపాధ్యక్షునిగా కిరణ్‌కుమార్, కోశాధికారిగా దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా సూర్య ఎన్నికైన వారిలో ఉన్నారు. పలువురు ఉద్యోగులు వారిని అభినందించారు.



వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నకేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రత్యామ్నాయ సాగుపై ప్రణాళికలు రూపొందించాలి

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 28 : రైతు ఆర్థిక పరిస్థితి మెరుగుపడే విధంగా, అధిక లాభాలు ఆర్జించే ప్రత్యామ్నాయ పంటలసాగుపై ప్రతి రైతుకు అవగాహన కలిగించేలా ప్రణాళికలు రూపొందించేలా వ్యవసాయ యూనివర్సిటీ పరిశోధన విభాగం పనిచేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం లాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవతేజ, శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులతో కలసి సందర్శించి, అధికారులతో సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ పరిశోధనా స్థానాలు, విస్తరణ కేంద్రాల నుంచి ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై ఏర్పాటు చేసిన పదర్శనలోని వంగడాలు, ఉత్పత్తులు, యంత్రపరికరాలు, పరిశోధన ఫలితాలను విశ్వవిద్యాలయ ఉప కులపతి శారద జయలక్ష్మి దేవి, పరిశోధన సంచాలకులు సత్యనారాయణ కేంద్రమంత్రికి వివరించారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనాన్ని, డ్రోన్ శిక్షణా సెంటర్ కేంద్ర మంత్రి పరిశీలించారు. పరిపాలన భవనాల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని పనులను పర్యవేక్షిస్తున్న ఏపీఐఐసి అధికారులను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. అదే విధంగా వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ డ్రోన్ల ద్వారా పురుగుమందులు, ఎరువుల పిచికారి చేసే విధానంను కేంద్ర మంత్రి పరిశీలించి, గ్రామీణ ప్రాంతయువత డ్రోన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవటంతో పాటు, ప్రభుత్వం అందించే వ్యవసాయ డ్రోన్లను క్షేత్రస్థాయిలో సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలోని బోర్డు మీటింగ్ రూములో విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లాలో వరద ముంపు వలన వ్యవసాయ శాఖ జరిగిన నష్టాలు, పరిహారం అందజేతపై కేంద్ర మంత్రి చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవతేజ, శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులతో కలసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. వరద ముంపు వలన వ్యవసాయ, ఉద్యాన పంటలకు, పశువులకు జరిగిన నష్టాలు, ప్రభుత్వం మంజూరు చేసిన నష్ట పరిహారం, రానున్న రబీ సీజన్ కు విత్తనాలు, ఎరువులు సన్నద్ధత, కౌలు రైతులకు ఋణాల మంజూరుపై తదితర అంశాలపై జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ బార్గవ తేజ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 28: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 590.00 అడుగులకు చేరుకుంది. ఇది 308.46 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,350 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5439 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 22,574 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 41,162 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 41,162 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 28 వేల 880 క్యూసెక్కులు

- డెల్టా కాలువలకు 9వేల 282 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 28: ఎగువన ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 38 వేల 162 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జెఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.9 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 40 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 28వేల 880 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 9వేల 282 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పీఆర్ ఉద్యోగులకు నిబంధనలపై అవగాహన తప్పనిసరి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 28: పంచాయతీ రాజ్ శాఖలోని అధికారులు, అన్ని స్థాయిల ఉద్యోగులు చట్టం, ప్రభుత్వ నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగివుండడం తప్పనిసరి అని జిల్లా పరిషత్ సీఈఓ వి జ్యోతిబసు అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ 2024- 2025 ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, డీఎల్‌డీఓలు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్ జీవిఆర్ కె మూర్తి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ అధికారిక ఆర్థిక వ్యవహారాల నిర్వహణపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా, జల్ జీవన్ మిషన్ ఆవశ్యకతను వివరించారు. టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ కె మధు కుమార్ మాట్లాడుతూ భవణ నిర్మాణ అనుమతులు , లే ఔట్స్ అనుమతులపై మాట్లాడారు. భవననిర్మాణ అనుమతుల ద్వారా, లేఔట్స్ అనుమతుల ద్వారా స్థానిక స్వపరిపాలన సంస్థలకు ఆదాయం సమకూర్చుకునే అవకాశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ సిహెచ్ కృష్ణ, జిల్లా శిక్షణ మేనేజర్ కంచర్ల నాగేశ్వరరావు, నిరంజన్ రావు, కరిముద్దీన్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణం వేణుగోపాల్

గుంటూరు, సెప్టెంబరు 28: ఆంధ్రప్రదేశ్ అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణం వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం ఆంధ్రప్రదేశ్ అర్చకసేవా సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణం వేణుగోపాల్ ఎంపిక అయ్యారు. గత సంవత్సరం పూర్వ అధ్యక్షులు రొంపిచర్ల శేషాచార్యులు మరణించడంతో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వేణుగోపాల్ కొనసాగుతున్నారు. శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నారాయణం వేణుగోపాల్ మాట్లాడుతూ సంఘ ఆశయాల సాధన కోసం అహర్నిశలు పాటుపడతానని, అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు బృందావనం రాధాకృష్ణ మూర్తి, ఆమంచి రవికుమార్, గొట్టిపాళ్ళ కృష్ణమాచార్యులు, దీవి వెంకట శేషుబాబు, పరాశరం జగన్మోహన్, నందివెలుగు శేషగిరిరావు, పెద్దింటి ఫణి రాజేంద్రకుమార్, చెగోలం శేషాచార్యులు, వివిధ జిల్లాల నాయకులు యనమదల ఆంజనేయులు, చిట్యాల మల్లికార్జునశర్మ, వడ్లమాను రమణాచార్య, బృందావనం గోపీచంద్, మేడూరి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆సత్తెనపల్లి◆ పెదకూరపాడు

జిల్లా స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థుల ఎంపిక

నకరికల్లు, సెప్టెంబరు 28: స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో నకరికల్లు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి చెందిన బాలికలు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కే లక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ కే శివపార్వతి తెలిపారు. యోగాలో అండర్- 17 విభాగంలో సావిత్రి మధులత, అండర్- 14లో వైష్ణవి, తాజప్ప, ఖోఖో విభాగంలో వైష్ణవి ఎంపికైనట్లు తెలిపారు. అథ్లెటిక్స్ విభాగంలో వంద మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో మేఘన, 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. వంద మీటర్ల పరుగు పందెంలో వైష్ణవి ద్వితీయ స్థానంలో నిలవగా 600 మీటర్ల పరుగు పందెంలో మహేశ్వరి ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలను ప్రిన్సిపాల్ లక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ కే శివపార్వతిలు అభినందించారు.

గిరిజన సంక్షేమ పాఠశాల బాలికలు

కారంపూడి, సెప్టెంబరు 28: జిల్లా స్థాయి పోటీలకు పట్టణంలోని గిరిజన సంక్షేమ పాఠశాల బాలికలు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్, వ్యాయామ ఉపాధ్యాయిని ప్రమీల తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ దుర్గి జిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్, యోగా పోటీల్లో తమ పాఠశాల బాలికలు ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. అండర్ - 17 విభాగంలో 200, 100 మీటర్ల పరుగుపందెంలలో, జావెలిన్ త్రోలో హర్షిణీబాయి ప్రథమం స్థానం సాధించిందన్నారు. అలాగే దుర్గాబాయి 1500 మీటర్లులో రెండోస్థానం, 3కి.మీ.ల పరుగుపందెంలో మొదటిస్థానం, 400 మీటర్లలో ఆర్ ప్రమీల మూడోస్థానం, అండర్ - 14 విభాగంలో 600 మీటర్లలో వి.శ్రీవల్లి, 400 మీటర్లలో బి.పూజ మూడోస్థానం సాధించారన్నారు. వీరంతా జిల్లా స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. శనివారం విద్యార్థినులను పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.

కబడ్డీ జట్టులో శిరిగిరిపాడు ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

వెల్దుర్తి, సెప్టెంబరు 28: మండలంలోని శిరిగిరిపాడు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు నియోజకవర్గ కబడ్డీ టీంకు ఎంపికైనట్లు హెచ్ఎం పద్మ తెలిపారు. మాచర్ల మండలంలోని కంభంపాడు జడ్పీ హైస్కూల్లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో ఈ ఎంపిక జరిగిందన్నారు. అండర్ -14 విభాగంలో మండ్లి త్రివేణి, బందెల వివేచన ఎంపికయ్యారన్నారు. అలాగే అండర్ - 17 విభాగంలో మిరియాల నవీన, ఏపూరి శ్రీవలి, మండ్లి హనుమమ్మలు ఎంపికైనట్లు చెప్పారు. శనివారం పాఠశాలలో విద్యార్థినులను అభినందించారు.

కంభంపాడులో ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో సరోజినీదేవి

మాచర్ల రూరల్, సెప్టెంబరు 28: మండలంలోని కంభంపాడు జడ్పీ హైస్కూల్లో శనివారం హెచ్ఎం రామిరెడ్డి విజయకుమారి, పీఈటీ కర్తయ్య ఆధ్వర్యంలో పల్నాడు బి.జోనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆటల పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో సరోజినిదేవి రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీడీ కె.మల్లికార్జునరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.అంజయ్య, బిక్రష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ పోటీలకు మిరియాల విద్యార్థులు

కారంపూడి, సెప్టెంబరు 28: జిల్లా స్థాయి చెస్ పోటీలకు తమ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు మండలంలోని మిరియాల జడ్పీ హైస్కూల్ హెచ్ఎం వై వెంకటేశ్వర్లు తెలిపారు. మాచర్ల పట్టణంలోని బాలురోన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆటల పోటీల్లో తమ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న కె.మనీషా, బి.బావనలు అత్యుత్తమ ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం చెప్పారు. శనివారం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయిని అంజమ్మ, విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్, కబడ్డీ జిల్లా పోటీలకు విద్యార్థుల ఎంపిక

దాచేపల్లి, సెప్టెంబరు 28: గురజాల నియోజకవర్గంలోని వివిధ మండల స్థాయిలో జరిగిన కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో దాచేపల్లికి చెందిన మదర్‌థెరిస్సా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం బ్రాహ్మణపల్లిలో జరిగిన అండర్ - 14 విభాగంలో వాలీబాల్ పోటీలో జి.రామ్‌చరణ్, అండర్-17 విభాగంలో పి.జగదీష్, కబడ్డీ పోటీలో అండర్-17 విభాగంలో కె జోసఫ్‌లు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని స్కూల్ కరస్పాండెంట్ అంబటి చంద్రశేఖరరావు అభినందించారు.

పిడుగురాళ్ల, సెప్టెంబరు 28: జిల్లా పరిషత్ బ్రాహ్మణపల్లి హైస్కూల్లో శనివారం జరిగిన స్కూల్ గేమ్స్‌లో పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-17 విభాగం వాలీబాల్ పోటీలో వి.ప్రవల్లిక, అండర్-14 విభాగంలో వి.కేశవలు జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు పీఈటీ పోతురాజు తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్‌శాఖ ఏఈగా రవికిరణ్

అమరావతి, సెప్టెంబరు 28: మండల విద్యుత్‌శాఖ ఏఈగా పి.రవికిరణ్ బాధ్యతలు స్వీకరించారు. సత్తెనపల్లి ఏఈగా పనిచేసి బదలీపై అమరావతి వచ్చారు. ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు మండలపరిధి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ తెలిపారు. తాడేపల్లి నుంచి తాడికొండ 132కేవీ లైన్ సామర్థ్యం పెంచుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

● వ్యవసాయ సహాయ సంచాలకులు జగదీశ్వరరెడ్డి

మాచర్లటౌన్, సెప్టెంబరు 28: మాచర్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 2024 ఖరీఫ్ సీజన్లో పంట నమోదు చేసుకున్న రైతులు ఈనెల 30వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని మాచర్ల వ్యవసాయ సహాయ సంచాలకులు జగదీశ్వరరెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే పంటలబీమా, పంటలు మద్దతు ధరకు విక్రయించుకునే సమయంలో లబ్ధి పొందుతారన్నారు.

రేపు నగర పంచాయతీ సమావేశం

దాచేపల్లి, సెప్టెంబరు 28: దాచేపల్లి నగర పంచాయతీ సమావేశం సోమవారం దాచేపల్లి సచివాలయం-1 కార్యాలయంలో జరుగనున్నదని నగర పంచాయతీ కమిషనర్ అప్పారావు తెలిపారు. సమావేశంలో పలు సాధారణ అంశాలను ప్రస్తావిస్తారని తెలిపారు. చైర్‌పర్సన్ కొప్పుల అధ్యక్షత వహించాలని తెలిపారు.

మెప్మా ఆధ్వర్యంలో ఉత్పత్తుల అమ్మకాలు

దాచేపల్లి, సెప్టెంబరు 28: దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెటింగ్‌లో ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తుల అమ్మకాలు జరిగాయి. నగర పంచాయతీ కమిషనర్ అప్పారావు, ఇతర మెప్మా సిబ్బంది హాజరయ్యారు.

గురజాల ఏపీపీగా నాగమణి

గురజాల లీగల్, సెప్టెంబరు 28: గురజాల అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఏపీపీగా నేలపాటి నాగమణి నియమితులయ్యారు. శనివారం నాగమణి బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి జూనియర్ సివిల్ కోర్టు నుంచి బదిలీపై నాగమణి గురజాలకు వచ్చారు.

పశు కిసాన్ క్రెడిట్ స్కీంకు దరఖాస్తు చేసుకోవాలి

● డాక్టర్ బషీర్

రెంటచింతల, సెప్టెంబరు 28: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పశుపోషకులు పశు కిసాన్ క్రెడిట్ స్కీం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ బషీర్ కోరారు. అక్టోబరు 10వ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఇప్పటివరకు 74 దరఖాస్తులొచ్చాయన్నారు. ఈ పథకం కింద పశుపోషకులకు రూ.25 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు 7శాతం వడ్డీతో రుణం పొందే అవకాశం ఉందన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లతో పశువైద్యశాలలో సంప్రదించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

● మున్సిపల్ చైర్మన్ నరసింహారావు

మాచర్లటౌన్, సెప్టెంబరు 28: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. శనివారం వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో విద్యార్థులతో 5వేల సీడ్స్ బాల్స్ తయారు చేయించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చైర్మన్ నరసింహారావు మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో సీడ్స్ బాల్స్ చల్లడం ద్వారా వర్షాలకు మొక్కలు పెరుగుతాయన్నారు. మొక్కలు సంరక్షించుకునే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, కార్యదర్శి పందిరి నరసింహారావు, ఉపకార్యదర్శి బచ్చు రాజ్‌కుమార్, కోశాధికారి చుండూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వనరుడు గుర్రం జాషువాకు నివాళి



జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కన్నా నాగరాజు, ఎలినేడి రామస్వామి తదితరులు

సత్తెనపల్లి, సెప్టెంబరు 28: విశ్వనరుడు గుర్రం జాషువా జయంతిని శనివారం పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో రోడ్డులో ఉన్న జాషువా విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. జాషువా విగ్రహానికి గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, పలువురు టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చౌట శ్రీనివాసరావు, బండారు నాగరాజు, జంగాల శ్రీనివాసరావు, గుజ్జర్లపూడి స్టాలిని, బలిజేపల్లి సురేష్ కుమార్, పెద్దింటి వెంకటేశ్వర్లు, గుర్రం జాషువా జయంతి నిర్వహణ కమిటీ సభ్యులు, సీపీఐ నాయకులు, వివిధ ప్రజాసంఘాల నేతలు జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవనరేఖ లు పుస్తకాన్ని ఆవిష్కరించారు.

మాచర్లటౌన్, సెప్టెంబరు 28: పట్టణంలో గుర్రం జాషువా జయంతిని దళిత బహుజన బీమ్‌సేన, డప్పు, జానపద కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత బహుజన బీమ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు జార్జి మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం నిర్మూలనకు జాషువా ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో శ్రీవీరబ్రహ్మేంద్ర ప్రజాహక్కుల పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గురజాల అప్పారావు, చాకలి ఐలమ్మ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మన్నెం పాండురంగారావు, బీసీ సంఘం నాయకురాలు కొరదల జ్యోతి, కడియం శారమ్మ, పిచ్చయ్య, యోహాను తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల, సెప్టెంబరు 28: రెంటచింతలలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ ఆధ్వర్యాన గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెదకూరపాడు, సెప్టెంబరు 28 : పెదకూరపాడులోని కచేరి సెంటర్లో జిల్లా పరిషత్ హైస్కూల్లో గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, లగడపాడు సర్పంచ్ వేమవరపు నాగేశ్వరరావు, ప్రజాకవి దర్శి శేషారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. జడ్పీస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ, ఉపాధ్యాయులు జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అచ్చంపేట, సెప్టెంబరు 28 : స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జాషువా జయంతిని టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, తిరువాయిపాటి ఆంజనేయులు, పాటి బండ్ల బాపిరాజు, ఎనిగండ్ల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేటలో అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చిలుకా చంద్రయ్య ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద్రయ్యతో పాటు లీప్ సంస్థ అధ్యక్షుడు శిఖా నరసింహారావు, తిరువాయిపాటి ఆంజనేయులు, మచ్చా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ నిర్మూలనే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ లక్ష్యం

● సంస్థ జిల్లా అధికారి తమ్మాజీరావు, జేఈవో రమాదేవి



అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ జేఈవో రమాదేవి

క్రోసూరు, సెప్టెంబరు 28: నిరుద్యోగ నిర్మూలనే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ లక్ష్యమని ఆ సంస్థ జిల్లా అధికారి తమ్మాజీరావు, జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ జేఈవో రమాదేవి అన్నారు. శనివారం క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఆరు కంపెనీలు మేళాకు హాజరయ్యాయి. మొత్తం 183 మంది అభ్యర్థులు తమ పేర్లను రిజిస్టర్ చేయించుకొని ఇంటర్వ్యూలకు హాజరు కాగా 47 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తమ్మాజీరావు, రమాదేవిలు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగాలు ఇప్పిస్తామన్నా రు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు ఇక్కడ జాబ్‌మేళా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డేవిడ్ రాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్‌మేళాను క్రోసూరులో నిర్వహించడం వల్ల అభ్యర్థులు హాజరవడానికి సౌకర్యవంతంగా ఉందన్నారు. నియామకపత్రాలు అందుకున్న యువతీ యువకులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమానికి నైపుణ్యాభివృద్ధి సంస్థ కో-ఆర్డినేటర్లు రామకృష్ణారెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

విజన్ స్వర్ణాంధ్ర- 2047 దిశగా అడుగులు వేద్దాం

● ఈవోపీఆర్డీ సత్యప్రసాద్

కారంపూడి, సెప్టెంబరు 28: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనల మేరకు విజన్ స్వర్ణాంధ్ర 2047 దిశగా మనమంతా అడుగులు వేద్దామని ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సభలు నిర్వహించి స్వచ్ఛతాహీ సేవ, స్వర్ణాంధ్ర- 2047, వందరోజుల పారిశుధ్యం కార్యక్రమాలపై అధికారులు వివరించారు. కారంపూడిలో ఇన్‌చార్జి సర్పంచ్ సరస్వతి బాలునాయక్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, వంద శాతం మరుగుదొడ్లు కలిగి ఉండాలని, వంద రోజులపాటు పారిశుధ్య కార్యకలాపాల నిర్వహణకు యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలని అన్నారు. మండలంలోని పెదకొదమగుండ్లలో ఇన్‌చార్జి సర్పంచ్ లక్ష్మయ్య, ఒప్పిచర్లలో ఇన్‌చార్జి సర్పంచ్ పుష్పావతి అధ్యక్షతన సభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, మోదీన్‌షా, చల్లా శ్రీను, బ్రహ్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాచవరం, సెప్టెంబరు 28: 2047 సంవత్సరానికి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతి ఒక్కరు అడుగులు ముందుకు వేయాలని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు తెలిపారు. మండలపరిధిలోని అన్ని గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో అధికారులు స్పష్టం చేశారు. ముఖ్యంగా విజన్ స్వర్ణాంధ్ర- 2047 ప్లాన్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వంద రోజుల పాటు పారిశుధ్య కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంపద తయారీ కేంద్రాన్ని తిరిగి అమల్లోకి తీసుకురావటం తదితర విషయాల గురించి ఆయా గ్రామాల ప్రజలకు వివరించారు. ఈ మూడు కార్యక్రమాలకు సంబంధించి ప్రజలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు సహకరించాలన్నారు. ఆయా గ్రామ సభల్లో ఈవోఆర్‌డీ వెంగళరావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అవగాహన



గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు ఎల్ శ్రీనివాసులురెడ్డి తదితరులు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 28: గుండె జబ్బులపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పిడుగురాళ్ల అంజిరెడ్డి హాస్పిటల్ వైద్యులు లోకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం ప్రపంచ గుండె దినోత్స వంను పుర స్కరించుకొని స్థానిక అంజిరెడ్డి హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. 45 సంవత్సరాలు దాటిన వారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ గుండె పనితీరును పరీక్షించుకోవాలని, ఆహార నియమాలు, వ్యాయామం తప్పనిసరిగా ఉండాలని శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పలువురికి ఉచిత ఓపీ, ఈసీజీ, 2డీ, ఎకో తదితర వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ కోట శబరి గిరీష్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా చేపట్టాలి

● స్పెషలాఫీసర్ గబ్రునాయక్

మాచర్లటౌన్, సెప్టెంబరు 28: ప్రతి ఒక్కరూ గృహ నిర్మాణాలను త్వరగా చేపట్టాలని స్పెషలాఫీసర్ గబ్రునాయక్ కోరారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీ లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ గబ్రునాయక్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలు చేపట్టి త్వరగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సదస్సులో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, టీఎంసీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కాపర్ వైరు కేబుల్ దొంగల అరెస్టు

● రూ.48,600 విలువైన వైరు, ద్విచక్ర వాహనం స్వాధీనం

ముప్పాళ్ళ, సెప్టెంబరు 28 : కాపర్ వైరు కేబుల్ దొంగిలించిన కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.48,600 విలువైన కేబుల్ వైరు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ముప్పాళ్ళ పోలీసులు తెలిపారు. శనివారం ముప్పాళ్ళ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ నిందితుల వివరాలను తెలిపారు. మండలంలోని నార్నెపాడులో ఈనెల 27వ తేదీ ఎయిర్‌టెల్ సెల్‌ఫోన్ టవర్‌కు సంబంధించి కాపర్ వైర్ కేబుల్ చోరీకి గురైంది. సంబంధిత కంపెనీ ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి విచారించగా శనివారం ఉదయం నార్నెపాడు కెనాల్ ఆటో పాయింట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న పెదకూరపాడుకు చెందిన షేక్ సుభానీ, రామినేని నాగేశ్వరరావులను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్టు ఒప్పుకున్నారన్నారు. వీరి నుంచి రూ.48,600 విలువైన కేబుల్ వైరును, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 28 : ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కేఎస్ చక్రవర్తికి అందజేశారు.

రేపటి నుంచి నిరుద్యోగ యువతకు శిక్షణ

నకరికల్లు, సెప్టెంబరు 28 : నిరుద్యోగ యువతకు ఈనెల 30వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు జాబ్స్ కో-ఆర్డినేటర్ ఎరగోటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కోటప్పకొండ టీటీడీసీలో శిక్షణకు హాజరు కావాలనుకొనే వారు విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా జిరాక్స్, ఐదు ఫొటోలతో పాటు శిక్షణా సమయంలో ఇక్కడే ఉండేందుకు అవసరమైన లగేజీని తీసుకొని రావాలన్నారు. 2019 నుంచి 2024 సంవత్సరాల మధ్యలో ఒక ఆర్థిక సంవత్సరంలో వంద రోజులు ఉపాధి పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లో పిల్లలకు రూ.36వేలు శిక్షణా భృతి ఇవ్వనున్నట్టు వివరించారు. సీడాప్, డీఆర్‌డీఏ ఉపాధి కల్పన వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. డిగ్రీ పాసు లేదా ఫెయిల్ అయిన 19 నుంచి 27 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువ కులు ఈ శిక్షణకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 9908482907 నెంబరును సంప్రదించాలన్నారు.

పూజల్లో పాల్గొనాలని పిలుపునిచ్చిన జగన్ ఎక్కడ

● జనసేన నియోజకవర్గ సమన్వయకర్త అంకారావు

గురజాలటౌన్, సెప్టెంబరు 28: వైసీపీ శ్రేణులను శనివారం పూజల్లో పాల్గొనాలని పిలుపునిచ్చిన జగన్ ఎక్కడికెళ్లారంటూ జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మీ పార్టీ నేతలను పూజల్లో పాల్గొనాలని చెప్పి ఆచరాలను గౌరవిస్తే నువ్వు ఆలయానికి ఎందుకు వెళ్లలేదంటూ జగన్‌ను ప్రశ్నించారు. నాయకులు చెప్పడమే కాదు చెప్పిన మాటను గౌరవించాలన్నారు. తిరుమల లడ్డు ప్రసాదం కల్తీపై సిట్ విచారణ వేగవంతంగా జరుగుతుందని, అపవిత్రం చేసిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని అంకారావు అన్నారు.

తిరుమల తిరుపతి ప్రాయశ్చిత్త ప్రదక్షిణలు

అచ్చంపేట, సెప్టెంబరు 28: అచ్చంపేటలో శనివారం ప్రాయశ్చిత్త ప్రదక్షిణలు నిర్వహించారు. తిరుపతిలోని వేంకటేశ్వర స్వామి ప్రసాదం అపవిత్రతకు గురైనందున ఆ పాప పరిహారార్థం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రాయశ్చిత ప్రదక్షిణలు జరిగాయి. ఉదయం 7గంటలకు స్థానిక సీతారామ స్వామి ఆలయం నుంచి అనేక మంది భక్తులు వీధులగుండా నగర సంకీర్తన చేసుకుంటూ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకొని ఆలయం చుట్టూ 11 ప్రదక్షిణలు చేశారు.

ఘనంగా సాయిబాబా జయంతి వేడుకలు

అమరావతి, సెప్టెంబరు 28: స్థానిక షిరిడీసాయి పర్తిసాయి ధ్యాన మందిరంలో శనివారం షిరిడీ సాయిబాబా జయంతిని పురస్కరించుకుని భక్తులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం కాకడ హారతితో పాటు పవిత్ర కృష్ణా జలాలతో మహాస్నానం నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. వేడుకలతో పాటుగా తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డుప్రసాదం అపవిత్రం అయిన కారణంగా మందిరంలో సంప్రోక్షణ చేసి శాంతి హోమం, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి శాంతి కల్యాణం నిర్వహించారు.

జగన్ పాలనలో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి

సత్తెనపల్లి, సెప్టెంబరు 28 : జగన్ మానవత్వం నా మతమని చెపుతూ తన పాలనలో ఆలయాలపై దాడులు చేయించారని టీడీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ పాలనలో దేవాలయాలపై దాడులు, దేవతా మూర్తుల విగ్రహాల ధ్వంసం చేశారన్నారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో హిందువుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. అన్య మతస్తులను టీటీడీ చైర్మన్‌గా నియమించారన్నారు.

న్యాయవాద గుమాస్తాలకు కార్పస్ ఫండ్ ఇవ్వాలి

● సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు అసోసియేషన్ విజ్ఞప్తి



ఎమ్మెల్యే కన్నాని కలిసిన న్యాయవాది గుమాస్తాల సంఘం నాయకులు

సత్తెనపల్లి, సెప్టెంబరు 28: న్యాయవాది గుమాస్తాలకు ప్రభు త్వం కార్పస్ ఫండ్ రూ.3 కోట్లు మంజూరు చేయాలని న్యాయవాది గుమాస్తాల సంఘం నాయకులు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు విజ్ఞప్తి చేశారు. శనివారం కన్నా వారి తోటలోని ఎమ్మెల్యే కన్నా నివాసానికి గుమాస్తాల సంఘం నాయకులు వెళ్లి పలు సమస్యలను ఆయనకు నివేదించారు. ముఖ్యంగా తమకు మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయించాలన్నారు. న్యాయవాది గుమాస్తాలకు హెల్త్ కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న న్యాయవాది గుమాస్తాలందరికి ఇళ్లను మంజూరు చేయించాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే కన్నా సానుకూలంగా స్పందించి మీ సమస్యలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయవాది గుమస్తాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంగులూరి సుబ్బారావు, రాష్ట్ర వెల్ఫేర్ కమిటీ మెంబర్ నాళం బాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లభాపురపు సురేష్, విజయవాడ గుమస్తాల సంఘం అధ్యక్షుడు ఎంట్రాప్రగడ గోపాలకృష్ణమూర్తి, గుంటూరు గుమస్తాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోతురాజు సాంబశివరావు, సత్తెనపల్లి సంఘం నుంచి చిలుక అంబేద్కర్, అంగులూరి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

నడికూడి రైల్వే జంక్షన్‌ను పరిశీలించిన డీఆర్ఎం



నడికూడి రైల్వే జంక్షన్‌లో అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న గుంటూరు రైల్వే డీఆర్ఎం రామకృష్ణ తదితరులు

దాచేపల్లి, సెప్టెంబరు 28: నడికూడి రైల్వే జంక్షన్‌లో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ట్రాక్‌ను, ఇతర అభివృద్ధి పనులను గుంటూరు రైల్వే డివిజన్ మేనేజర్ రామకృష్ణ శనివారం పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న రన్నింగ్ రూమ్‌లు, నూతన రైల్వేట్రాక్ నిర్మాణం, స్టేషన్ ఆవరణలో జరుగుతున్న ఇతర అభివృద్ధి పనులు, కంప్యూటర్ సిగ్నల్ సిస్టమ్‌ను, రికార్డులను పరిశీలించారు. అనంతరం జరుగుతున్న అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారు లతో మాట్లాడి సమాచారం తీసుకున్నారు. డీఆర్ఎంతో పాటు ఇతర ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, నరసరావుపేట బ్రాంచ్ వారు ది.12-09-2024న ప్రచురించిన **పగడాల తిరుపతమ్మ** గారి యాడ్‌లో పొరపాటున లోన్ తీసుకొనే వారి పేరు **పగడాల శివకోటేశ్వరరావు** అని తప్పుగా పడినది. దీనిని **పగడాల తిరుపతమ్మ** గా చదువ కొనగలరు.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వ లైను, లేపేంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం సహించం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 28 : పారిశుధ్యం పనులలో నిర్లక్ష్యం చేస్తే సహించమని, తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. పట్టణంలో పారిశుధ్య పనులను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రజలు కూడా పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో మున్సిపల్ కార్మికులకు సహకరించాలన్నారు. మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ వేసి దోమల పెరుగుదలను అరికట్టాలన్నారు.

మార్చి5 లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 28 : పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం సమీపంలోని ఉప్పలపాడు రోడ్డులోని జగనన్న కాలనీ గృహ లబ్ధిదారులకు హౌసింగ్ అధికారులతో పట్టణంలో సమావేశం జరిగింది. లబ్ధిదారులు మార్చి 5 లోపు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవా

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 28 : స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా కేసానుపల్లిలో వ్యర్థాలను తొలగించారు. పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి జీవితంలో అలవాటుగా చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ చెత్తను వీధులలో వేయకుండా జాగ్రత్తపడాలని అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టడానికి పెద్ద ఎత్తున చర్యలు తీసుకోవాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్ అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.నాగమల్లేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ హెచ్.గంగాధర్, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఈశ్వర్ ఇంజనీరింగ్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రిన్సిపాల్ నాగ మల్లేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్ తదితరులు

వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్ పదోన్నతులు భర్తీ చేయాలి

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 28 : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్ పదోన్నతులు గ్రామ రెవెన్యూ సహాయకులతోనే భర్తీ చేయాలని రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆర్డీవో పీ.సరోజనికి శనివారం వినతిపత్రం అందజేశారు. తండ్రి స్థానంలో నామినీగా పని చేస్తున్న వారసులకు రెగ్యులర్ ఉద్యోగులుగా చేయడం, అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వోలుగా ప్రమోషన్ అవకాశం కల్పించుట వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. ముందుగా నరసరావుపేట ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ఉన్న సర్వే భవనంలో రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగ మల్లేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా జాన్ సైదా, ప్రధాన కార్యదర్శిగా ఉప్పల నరసింహారావు, జిల్లా సహాధ్యక్షుడిగా మాసిపోగు యేసు, ట్రెజరర్‌గా ఉప్పులూరి యోషే, జాయింట్ సెక్రటరీగా దూపాటి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా గోనుగుంట్ల ఝాన్సీ, నందం శైలజ, సుందరరావు, షేక్ మస్తాన్‌వలి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య, రాష్ట్ర ట్రెజరర్ చెన్నుపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్ఈసీ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా అంతరిక్ష వారోత్సవాలు



కళాశాలకు వచ్చిన ఇస్రో బృందానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎన్ఈసీ అధ్యాపకులు

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 28 : పట్టణంలోని స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ప్రఖ్యాత అంతరిక్ష కేంద్రం ఇస్రోతో కలిసి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ప్రతి సంవత్సరం అక్టోబరు 4 నుంచి 10వ తేది వరకు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. దీనిని పురస్కరించుకుని ఇస్రోతో కలిసి అక్టోబరు 7 నుంచి 9 వరకు కళాశాలలో మెగా ఈవెంట్‌ను జరపడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు క్విజ్, డ్రాయింగ్, వక్తృత్వం వంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు అంతరిక్షంలో ఉన్న అద్భుతాలను అన్వేషించడానికి అవకాశం కల్పిస్తుందని, ఇస్రో వంటి సంస్థలతో పని చేయడం గొప్ప విషయమని కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి చెప్పారు. వారోత్సవాలు విద్యార్థుల్లో అంతరిక్షంపై ఆసక్తిని పెంపొందిస్తుందని కళాశాల సెక్రటరీ మిట్టపల్లి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇస్రో బృందం శనివారం కళాశాలను సందర్శించి, కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు.



జాషువా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి.అరుణ్ బాబు, పక్కన డీఆర్వో వినాయకం



గుర్రం జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, సమాఖ్య నాయకులు

జాషువా పల్నాడు జిల్లా వాసి కావడం గర్వకారణం

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 28 : నవయుగ వైతాళికుడు గుర్రం జాషువా పల్నాడు జిల్లా వాసి కావడం జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుర్రం జాషువా 129 వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ తొలుత గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాషువా ఉపాధ్యాయుడిగా పని చేస్తూ కవిత్వం మీద మక్కువతో రచయితగా మారి సమాజాన్ని చైతన్యవంతం చేసే ఎన్నో రచనలు చేసారన్నారు. డీఆర్వో వినాయకం మాట్లాడుతూ గుర్రం జాషువా ఔన్నత్యాన్ని విశదీకరించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల నాయుడు గుర్రం జాషువా కవిత్వాన్ని వివరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని పలువురు అధికారులు పాల్గొన్నారు.

జాషువా రచనలు నేటి యువతకు ఆదర్శం : జీవీ

వినుకొండ, సెప్టెంబరు 28 : పట్టణంలోని జాషువా కళాప్రాంగణంలో కవి కోకిల గుర్రం జాషువా 129వ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముందుగా జాషువా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాప్రాంగణంలో రాష్ట్ర స్థాయి పౌరానికి పద్య పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వినుకొండ గడ్డపై జాషువా జన్మించడం మనందరి అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో మాట్లాడి ఎన్ఎస్‌పీ కాలనీ ఆవరణలో జాషువాకు చిహ్నంగా లైబ్రరీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సీనియర్ కళాకారుడు జత్తార్‌కు జాషువా అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో జాషువా సమాఖ్య అధ్యక్షుడు జాన్ సుందరరావు, రవి మాస్టార్‌తో పాటు కళాకారులు పాల్గొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ప్రముఖ కవి జాషువాతోపాటు, భగత్‌సింగ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో జాషువా విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. రచయితల సంఘం ఆధ్వర్యంలో జాషువా స్వగృహ యాత్ర చేపట్టి స్వగ్రామంలో ఆయకు గుర్తింపుగా స్మారక మందిరం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

● నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 28 : నవయుగ వైతాళికుడు, కవి కోకిల గుర్రం జాషువా 129వ జయంతిని శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వినుకొండకు చెందిన కవి కరీముల్లా పాల్గొన్నారు. తొలుత మహాకవి గుర్రం జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు జాషువా సాహిత్యం, వ్యక్తిత్వం గురించి కొనియాడారు. సభ అనంతరం కవి కరీముల్లాను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. సభకు కళాశాల అధ్యాపకులు డాక్టర్ కాకాని సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలు దీప, సీనియర్ ఆడిటర్ షేక్ బాజి మస్తాన్, పోలెపోగు సాగర్, ఎం.కృష్ణయ్య, పోలెపోగు సుశీల్, పి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు, సెప్టెంబరు 28 : కవికోకిల బిరుదాంకితులు గుర్రం జాషువా 129వ జయంతి శనివారం ఈపూరులో ఘనంగా జరుపుకున్నారు. జాషువా చిత్రపటానికి సర్పంచ్ పల్లమీసాల చెంచయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొందరు కళాకారులు జాషువా రచించిన పద్యాలను పాడి వినిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బందెల కన్నయ్య, దేవిరి స్వరాజ్, ఎమ్మార్పీయస్ నాయకుడు ముసలయ్య, ఎల్లయ్య, వీ.రామయ్య, వేల్పుల పేరయ్య, జోసఫ్, రత్నం పాల్గొన్నారు.

శనైశ్చరస్వామి దేవాలయంలో ప్రత్యేక హోమాలు

వినుకొండ, సెప్టెంబరు 28 : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా వినుకొండలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి నిశ్శంకరావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం నరసరావుపేట రోడ్డులోని చెక్కవాగు వద్ద ఉన్న జేష్టలక్ష్మి సమేత శ్రీ శనైశ్చరస్వామి దేవాలయంలో జానపాటి పరమేశ్వరరావుచే ప్రాయశ్చిత్త హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి గోనుగుంట్ల లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని వేదపండితుల మంత్రోచ్చరణతో మహా హోమంలో పాల్గొని జగన్ పాలనలో తిరుపతి లడ్డూ అపవిత్రం అయిందని క్షమించాలని కోరుతూ స్వామి వారికి 11 విశేష ద్రవ్యాలతో అభిషేకం, తైలాభిషేకం, తిలా లవణ అష్టోత్తర శతనామాల పూజలు, జేష్ట లక్ష్మీ మాతకు చక్రఅభిషేకం, గణపతి హోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జీవీ మాట్లాడుతూ జగన్ పాలనలో ఆలయాలు, విగ్రహాలపై దాడులు, రథాలను తగలబెట్టినప్పుడు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిష్టియన్లను ఉద్దరిస్తున్నట్లు జగన్ రెడ్డి నమ్మించారని, పాస్టర్లకు పింఛన్ ఇస్తానని ఎన్నికల ముందు జగన్ రెడ్డి హామీ ఇచ్చి, నామమాత్రంగా ఒక్క శాతం మంది పాస్టర్లకు ఇచ్చి మోసం చేసింది ఎవరూ మరిచిపోలేదన్నారు. సనాతన ధర్మానికి జగన్ వ్యతిరేకమని మండిపడ్డారు. అనంతరం భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీర మహిళలు, పార్టీ నాయకులు, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ దంపతులతో పాటు మక్కెన, శ్రీనివాసరావు

వక్ఫ్ బిల్లు పార్లమెంటరీ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ లావు

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 28 : వక్ఫ్ బోర్డు నిర్వహణను మెరుగుపరిచే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం-1995 సవరణ బిల్లు-2024పై నియమించిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ శనివారం హైదరాబాద్‌లో సమావేశం అయ్యింది. ఈ సమావేశానికి కమిటీలో సభ్యులుగా ఉన్న టిడిపీ పార్లమెంటరీ పార్టీ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పాల్గొన్నారు. సమావేశంలో సహచర సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు. బిల్లు విషయంలో మహిళలు ముందుకువచ్చి తమ అభిప్రాయలను తెలియజేసి, బిల్లు మెరుగుదలకు చొరవ చూపారు.



సమావేశంలో పాల్గొన్న టీడీపీ పార్లమెంటరీ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

మాజీ మంత్రి కాసుకు జన్మదిన శుభాకాంక్షలు

రొంపిచర్ల, సెప్టెంబరు 28 : మండలంలోని రొంపిచర్ల గ్రామానికి చెందిన పడాల చక్రారెడ్డి, మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి శనివారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాసు జన్మదినం సందర్భంగా హైదరాబాద్ వెళ్లి ఆయన పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు. చక్రారెడ్డితో పాటు గెల్లి మధుసూదనరెడ్డి, మానుకొండ రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

సామాజికవేత్త పీవీ సురేష్‌కు డాక్టరేట్ అవార్డు

వినుకొండ, సెప్టెంబరు 28 : వినుకొండ పట్టణానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త, రక్తదాత, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, టీడీపీ సీనియర్ నాయకుడు పీవీ సురేష్ ఆపదలో ఉన్న వారికి 85 సార్లు రక్తదానం చేసినందుకు గుర్తింపుగా డాక్టరేట్ అవార్డును ప్రదానం చేశారు. ఢిల్లీలోని ఆశోక్ హోటల్‌లో వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ వారు ప్రదానం చేసిన డాక్టరేట్ అవార్డును ఆయన కేంద్ర మాజీ మంత్రి షహనాజ్ హుస్సేన్ చేతుల మీదుగా శనివారం అందుకున్నారు. అనంతరం పీవీ సురేష్‌ను పార్లమెంటు సభ్యులతో పాటు, వివిధ దేశాల కమిషనర్లు అభినందించారు.

నూజెండ్లలో 'మన ఇల్లు.. మన గౌరవం' కార్యక్రమం

నూజెండ్ల, సెప్టెంబరు 28 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ జీ రమేష్ కుమార్ మాట్లాడుతూ లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు మండల స్థాయి అధికారులు సిద్ధంగా ఉన్నారని, త్వరితగతిన గృహాలు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జీ.యలమంద, జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు, రామయ్య, టీడీపీ నాయకులు వంకాయలపాటి పేరయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి : ఎంపీటీసీ

యడ్లపాడు, సెప్టెంబరు 28 : ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సకాలంలో సమస్యలు పరిష్కరించినపుడే ప్రభుత్వానికి, అధికారులకు మంచిపేరు వస్తుందని సొలస ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి అన్నారు. యడ్లపాడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ ఝాన్సీదయాసాగర్ అధ్యక్షతన శనివారం జరిగింది. సొలస ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి చర్చలో పాల్గొంటూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు లేకపోవడంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందన్నారు. రైతులకు ఎంత మేరకు ఎరువులు అవసరం అవుతాయో రైతు సేవా కేంద్రాలలో తెలియచేస్తే డిమాండ్‌కు అనుగుణంగా ఎరువులు తెప్పిస్తామని ఏవో సరిత తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్‌కు సంబంధించి జరిగిన చర్చలో గోకులం క్రింద మంజూరైన యూనిట్లు కన్నా అధికంగా డిమాండ్ ఉందని, అదనంగా యూనిట్లు కేటాయించేందుకు ప్రతిపాదనలు పెట్టాలన్నారు. సొలస సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడం లేదన్నారు. ఈ విషయమై స్పందించిన తహసీల్దార్ విజయశ్రీ సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూస్తాం : ఏడీఏ

ఈపూరు, సెప్టెంబరు 28 : ఎరువులు కొరత లేకుండా సకాలంలో రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని ఏడీఏ రవిబాబు అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ఎరువుల కొరత కథనానికి స్పందించిన వ్యవసాయశాఖాధికారులు శనివారం రైతు సేవా కేంద్రాల ద్వారా డీఏపీ, యూరియాను రైతులకు సరఫరా చేశారు. మండలంలోని ఇనుమెళ్ళలో ఉన్న ఈపూరు సొసైటీ ఎరువుల గోడౌన్‌లో ఎరువులను పరిశీలించారు. పురుగుమందులు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏడీఏ వెంట ఈపూరు మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

● నూజెండ్ల, సెప్టెంబరు 28 : మండలంలో పంటలు సాగు చేస్తున్న రైతులకు యూరియా, డీఏపీ కాంప్లెక్స్ ఎరువులు, సొసైటీలు, జీడీసీఎంఎస్, రైతు సేవా కేంద్రాల్లో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని ఏవో సుగుణా బేగం తెలిపారు. నూజెండ్ల, ఐనవోలు గ్రామాల్లోని సొసైటీల్లో ఎరువుల అమ్మకాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎరువుల అమ్మకాలను ప్రారంభించారు. కార్యక్రమంలో వీర్ల వెంకటస్వామి, రైతులు బేతపూడి చిరంజీవి, సంగు సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పారా గోపయ్య స్మారక ప్రతిభా పురస్కారాల పంపిణీ

వేల్పూరు(శావల్యాపురం), సెప్టెంబరు 28 : మండలంలోని వేల్పూరు జడ్పీ పాఠశాలలో గతేడాది పది, ఏడవ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు పారా గోపయ్య స్మారక ప్రతిభా పురస్కార ప్రదానోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పదవ తరగతిలో 500పైన మార్కులు సాధించిన 24 మంది విద్యార్థులను, ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన 12 మంది విద్యార్థులను, 7వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించి నగదు బహుమతులు మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం గోపయ్య భార్య సరోజినీదేవిని గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, జడ్పీటీసీ పారా హైమావతి, రిటైర్డ్ డీఎస్పీ బి.నాగేశ్వరరావు, రిటైర్డ్ లెక్చరర్ బి.సుందరరావు, ఎస్ఐ లోకేశ్వరరావు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ డి.శ్రీనివాసరావు, హెచ్ఎం సుభానీ, గ్రామ పెద్దలు బ్రహ్మానందం, పేరయ్య చలపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047 సాధనకు కృషి చేయాలి : ఎంపీడీవో

శావల్యాపురం, సెప్టెంబరు 28: ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వర్ణాంధ్ర 2047ను సాధించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంపీడీవో సీతారామయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామస్థాయి అధికారులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఏఎస్‌వో చెన్నయ్య, ఏపీఎం జి.వాసుబాబు, ఎంఈవో-2 లలితాకుమారి, ఏఈవో అశోక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీలత పాల్గొన్నారు.

క్రీడాకారులకు చదువుతో పాటు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు

చిలకలూరిపేట, సెప్టెంబరు 28 : క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు చదువుతో పాటు ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందని పట్టణ ఎస్ఐ చెన్నకేశవులు అన్నారు. పట్టణంలోని ఏఎంజీ సేవా సంస్థ ప్రాంగణంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ బాక్సింగ్, బాస్కెట్ బాల్ సెలక్షన్స్ శనివారం జరిగాయి. బాక్సింగ్ పోటీలను ప్రారంభించిన ఎస్ఐ చెన్నకేశవులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారిని 12 మంది చొప్పున జట్టుగా ఎంపిక చేశారు. ఏఎంజీ డైరెక్టర్ అరుణ్ కుమార్ మహంతి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్ సురేష్ కుమార్, నరసింహారావు, ఖాదర్ మస్తాన్, ఖాశింబుడే, ప్రిన్సిపల్ కృపాదానం, శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి, రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

రొంపిచర్ల, సెప్టెంబరు 28 : మండలంలోని తురుమెళ్ళకి చెందిన గంగవరపు సుమతి ఈనెల 27న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆమెను చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. ఆమె భర్త లింగారావు, ఆమె ద్విచక్ర వాహనంపై సంతగుడిపాడుకు వెళ్ళి వస్తుండగా గుర్తు తెలియని వాహనం తగలటంతో ఆమె ప్రమాదానికి గురైంది. భర్త ఫిర్యాదు మేరకు రొంపిచర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వయం ఉపాధికి కొండంత అండగా ప్రభుత్వ పథకాలు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 28 : పేదల స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంభనకు కొండంత అండగా కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం ద్వారానే చిన్న వ్యాపారాల నుంచి సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల స్థాయి వరకు లబ్ది పొందే అవకాశం ఉందన్నారు. కాస్త అవగాహనతో వాటిని ఉపయోగించు కోగలిగితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరుకున్న పేదరికం లేని ఆంధ్రప్రదేశ్ స్వప్నాన్ని త్వరలోనే చూస్తామన్నారు. విజయవాడ బాధితులకు అండగా నిలుస్తూ చిలకలూరిపేట మోటార్ వెహికల్ అసోసియేషన్ సభ్యులు సీఎం సహాయ నిధికి లక్ష విరాళం అందించారు. స్థానిక కేబీ రోడ్డులో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విరాళానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు అందజేశారు. లక్ష చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపుతున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు. కేబీ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా కొంత వెనక్కి జరగాలని చెప్పామని, ఎవరినీ నష్టపొమ్మని చెప్పలేదని, ఎవరైనా నష్టపోయి ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. టిడ్కో గృహ సముదాయంలో 5520 టిడ్కో ఇళ్ళు ఉన్నాయని, ఇప్పుడు రెండు వేల గృహాల్లో మాత్రమే నివాసం ఉంటున్నారని, మిగిలిన గృహాల్లో ఎవరు చేరతామంటే వారికి ఇల్లు ఇస్తామన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధికి లక్ష విరాళం అందిస్తున్న మోటార్ వెహికల్ అసోసియేషన్ సభ్యులు

శ్రీ దత్త సాయి సన్నిధిని దర్శించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 28 : ప్రజలకు మంచి చేసే వారికి, అందరి మంచిని కోరుకొనే వారికి ఆ షిరిడీ సాయి ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని సుబ్బయ్యతోటలో గల శ్రీ దత్త సాయి సన్నిధిని శనివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దర్శించుకొని షిరిడీ సాయి బాబా 189వ జయంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి జయ జయ సాయి ట్రస్ట్ ద్వారా సేవా గుణం కలిగిన పలువురికి శ్రీ సాయి ఉత్తమ సేవా పురస్కారాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో అభివృద్ధి చెందుతూ మంచి ఆరోగ్యంతో ముందుకుసాగాలని భగవంతుడిని వేడుకున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు.

కనపర్రు పోస్టాఫీసులో పొదుపు సొమ్ము స్వాహా

నాదెండ్ల, సెప్టెంబరు 28 : భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడతాయన్న లక్ష్యంతో పోస్టాఫీసులో పొదుపుగా చెల్లించిన సొమ్మును అధికారులే స్వాహా చేశారు. ఈ ఘటన మండలంలోని కనపర్రు గ్రామంలో కొద్ది రోజుల క్రితం జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఖాతా దారులు పోస్టల్ ఖాతాలో నెలకు రూ.2 వేలు, రూ.3 వేలు, రూ.వెయ్యి ఇలా వివిధ రకాలుగా నెల వారీగా రికరింగ్ డిపాజిట్లు కట్టారు. అయితే కనపర్రు పోస్టుమాస్టరు చందు, పోస్టుమేన్ సలీంలు ఆ సొమ్మును స్వాహా చేశారు. విచారణ చేపట్టిన ఇన్‌స్పెక్టర్లు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వీరిద్దరి నుంచి రూ.8.80 లక్షలు రికవరీ చేశారు. ఈ రికవరీ మొత్తాన్ని రెండు రోజుల నుంచి ఖాతాదారులకు పంపిణీ చేస్తున్నారు. ఇద్దరిని విధుల నుంచి పక్కన పెట్టారు. నరసరావుపేటకు చెందిన వంశీని కనపర్రు బ్రాంచ్ ఇన్‌చార్జ్ పోస్టుమాస్టర్‌గా నియమించారు.